# సంఘసేవయే సరియైన మానవత్వమునకు చిహ్నము

సంఘసంస్కారమంతయు గంగ కలసె
మనిషి జాతికి తృప్తియే మాయ మయ్యె
శీల నైతిక విలువలు చితికిపోయె
ఔర! ఏమందు మానవ జీవితంబు.

ప్రేమస్వరూపులారా!

కుటుంబము క్షేమముగా నుండవలెనన్న, సంఘము పురోభివృద్ధి గాంచవలెనన్న, దేశము సస్యశ్యామలము కావలెనన్న మానవజాతియందు ఐకమత్యము, సంఘీభావము అభివృద్ధి కావాలి. ఈ కలియుగమునందు అన్ని శక్తులకంటె సంఘశక్తి చాలా బలమైనది. సంఘమనగా ఏమిటి? అనేకమంది అనేక భావములతో, అనేక మార్గములలో, అనేక తలంపులతో ఉండినవారు ఏక భావముతో, ఏకతలంపుతో, ఏకలక్ష్యముతో జీవింపచేసేదే సంఘము. వ్యష్టి సాధించలేని కార్యము సమష్టి సులభముగా సాధించగలదు. భారతదేశ సంస్కృతి సమష్టి భావమునే అంగీకరించిందిగానీ వ్యష్టిభావమును అంగీకరించలేదు. మన జీవితము సమష్టి జీవితమేగానీ వ్యష్టి జీవితము కాదు. కనుక సమష్టి జీవితమును అభివృద్ధిపరచినప్పుడే మానవత్వము సుఖశాంతుల నందుకోగలదు. అనైక్యత అసంతృప్తి కలిగిస్తుంది, అనేక బాధలను చేకూరుస్తుంది. సంతృప్తి మానవత్వమును ఏకత్వము గావించి దివ్య జీవితముచేత పవిత్రము చేస్తుంది. కనుక, సంఘశక్తి ఎంతో గొప్పది. కేవలము గడ్డిపోచ చిన్న చీమను కూడా బంధించలేదు. కానీ అలాంటి గడ్డిపోచలు అనేకంగా చేర్చి త్రాడుగా నేసినప్పుడు మదించిన గజమునుకూడా బంధించగలదు.

srisathyasaivachanamrutam

**విజ్ఞానముతోబాటు వివేకముండినపుడే రాణిస్తుంది**

కనుక, మానవత్వములో ఈనాడు ఐకమత్యము, సంఘీభావము అత్యవసరము. కానీ దురదృష్టవశాత్తు భారతదేశమందు ఈ ఐకమత్యము క్షీణించటంచేత, సంఘీభావము లేకపోవటంచేత భారతదేశము అనేక బాధలు అనుభవించవలసి వచ్చింది. భారతదేశములో శక్తివంతులు, శ్రీమంతులు లేకపోలేదు. బలవంతులు లేకపోలేదు. మేధావంతులు లేకపోలేదు. కానీ ఇంతమంది ఉన్నప్పటికిని వీరి మధ్య ఒకరికొకరికి ఐకమత్యము, సంఘీభావము లేక దేశము ఈ విధముగా దిగజారిపోయింది. కనుక, భావి భారతోద్ధారకులైన మీరు ఈ ఐకమత్యమును, సంఘీభావమును అభివృద్ధి గావించుకొనుటకు తగిన చర్యలు తీసుకోవాలి. రాజకీయము divide and rule అను సూత్రమును పురస్కరించుకొని భారతదేశమును అనేక రకములుగా విచ్ఛిన్నము చేస్తూ వచ్చింది. మనము divide చేయకూడదు. ఐకమత్యము మహాబలము. దీనిని ఆచరించటమే మహా శక్తివంతము. వైజ్ఞానికముగా అభివృద్ధి గాంచినది భారతదేశము. విజ్ఞాన శాస్త్రములో ఎంతో అభివృద్ధి గాంచినప్పటికిని దీనికి వివేకము చేరినప్పుడే ఈ విజ్ఞానము కొంత శోభించగలదు. వివేకమునకు, విజ్ఞానము అవసరము. విజ్ఞానమునకు, కొంతవరకు ఆచరణ అత్యవసరము. Knowledge without action is useless, action without knowledge is foolishness. ఈనాడు knowledge ఉన్నది కానీ action లేదు. action ఉన్నది గానీ knowledge లేదు. విజ్ఞానముతో బాటు వివేకము ఉండినప్పుడే ఇది రాణించగలదు. ఏ చిన్న విషయమునందు నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, లౌకిక విషయములందు కూడా ఈ విధమైన విచ్ఛిన్నములు అనేక విభాగములు చేస్తున్నాయి. అంతేకాక వికారమైన అర్థములు ప్రబోధిస్తూ వస్తున్నాయి.

**దుష్టశిక్షణ, శిష్టరక్షణలకు కారణం దైవముకాదు**

లోకములో స్వార్థరహితమైనది ఏది అని విచారించినప్పుడు దైవమే స్వార్థరహితమైన వాడు. తల్లి, తండ్రి, భార్య బిడ్డలకు అంతోఇంతో స్వార్థము ఉండవచ్చును. కానీ దైవమందు ఎట్టి స్వార్థము ఉండదు. దైవకార్యములు ఆలోచించినప్పుడు స్వార్థము ఉండినట్లుగా గోచరిస్తుంది. ప్రహ్లాదుని రక్షించాడు హిరణ్యకశిపుని శిక్షించాడు; విభీషణుని రక్షించాడు, రావణుని

sri sathyasai vahini

శిక్షించాడు, కంసుని శిక్షించాడు. ఈ విధముగా చూచినప్పుడు రక్షణ, శిక్షణ స్వార్ధముతో కూడినవని భావించవచ్చును. దుష్టులను శిక్షించుటకు గానీ శిష్టులను రక్షించుటకుగానీ దైవము కాదు. ఇది మానవుని అపార్థములు. మంచిచెడ్డల స్వభావమే. తన మంచితనమే తనను రక్షించుతుంది. తన చెడ్డతనమే తనను శిక్షిస్తుంది.

**దేవుడనగ వేరు దేశమందున లేడు**
**దేవుడుండు తనదు దేహమందె**
**పాపమనగా వేరు పరదేశమున లేదు**
**తనదు చేయుపనుల దగిలియుండు**

శిక్షణ రక్షణ దైవము వలన జరిగినవి కాదు. దైవము రెండింటికి సాక్షీభూతుడేగానీ కారకుడు కాదు. ఈ రకమైన సత్యప్రబోధలు జగత్తులో సల్పకపోవటం చేత సామాన్య మానవులకు ఈ సత్యము గుర్తించుకోటం కష్టమవుతున్నది.

ఒకానొక సమయములో షిర్డీలో ద్వారకామాయి ఆశ్రమము ముందు బాబా రాగి నాణెములను చూస్తూ కూర్చున్నాడు. ఎంతమంది భక్తులో వేచిఉన్నారు. ఎవరిని గమనించలేదు. ఆ చేతినుండి ఈ చేతికి, ఈ చేతినుండి ఆ చేతికి నాణెములను మార్చుకుంటూ కూర్చున్నాడు. ఎంతసేపు చూసినా కన్నెత్తి ఎవరిని చూడలేదు. ఎవరితో మాట్లాడలేదు. ఇంతలో దామా వచ్చాడు. అతను నిరంతరము బాబాతో ఉండే వ్యక్తి. దామా వచ్చి, "బాబా! ఎంతమందో కాచుకొని ఉంటున్నారు. ఏదో ఆడుకుంటున్నారు. ఏమిటి రహస్యము, ఎందుకోసం నాణెములు చూస్తున్నారు. పరీక్షిస్తున్నారా?" అని ప్రశ్నించాడు. 'బేటా! చూడు ఒక్క నాణెము కూడా సరిగాలేదు. ఒక వైపున అక్షరాలు పోయినాయి. మరొక వైపున రూపము పోయింది. ముక్కలైపోయింది. మరొకటి కొన్ని సొట్టపడి పోయాయి. ఏది పనికి వస్తుందని చూస్తున్నాను!" అన్నాడు బాబా. "పనికి రానివి పారవేయండి. ఎందుకు చూడటం?" అన్నాడు దామా. "ఒరే బేటా, అర్థం చేసుకో. వస్తున్నారు ఇంతమంది భక్తులు. ఇందులో ప్రతి ఒక్కరు నాణెముమాదిరి సొట్టపోయినవి, చెల్లనివిగా కనిపిస్తున్నాయి గానీ ఒక్కరైనా నాకు అవసరమైనవారు కనిపించటంలేదు" అన్నాడు బాబా. కొంతమంది లోక సంబంధమైన వాంఛలతో వస్తున్నారు.

sri sathyasai vachanamrutam

కొంతమంది విద్యార్థులు పరీక్షలో ప్యాసు కావాలని వస్తున్నారు. ఇంకా కొంతమంది marriage కావాలని వస్తున్నారు. కొంతమంది ఉద్యోగం కావాలని వస్తున్నారు. ప్రమోషను కావాలని వస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క కోరికతో వస్తున్నారు గానీ ఆత్మజ్ఞానం కావాలని కోరేవారు ఒక్కరైనా నాకు కనిపించటం లేదు. వీరందరు ఈ నాణెముల మాదిరి ఉంటున్నారు. ఎవరు నాకు పనికివస్తారా", అని చూచుకుంటున్నాను అని వివరించాడు బాబా. ఇందులో ఒక్కరైనా చెప్పిన మాట వినేవారు లేరు. నాకు స్వామి కావాలంటారు. స్వామి ఆజ్ఞ ఎంతవరకు పాటిస్తున్నారు. పాటించని సమయంలో భక్తి ఎక్కడ ఉంది? దామాను పిలచి 'చూడు ఆ మామిడి చెట్టు బాగా పూతతో ఉంది. ఆకులు కనిపించకుండా ఎన్ని పువ్వులు ఉంటున్నాయి. కట్టకడపటికి ఎన్ని కాయలు కాస్తున్నాయి? ఎన్ని ఫలములుగా మారుతున్నాయి? మంచుకు కొన్ని పూలు రాలి పోతున్నాయి. గాలికి మరికొన్ని పూలు రాలిపోతున్నాయి. కొన్ని పిందెలవుతున్నాయి. కొన్ని పిందెలు రాలిపోతున్నాయి. కొన్ని కాయలుగా తయారవుతున్నాయి. మరికొన్ని కాయలు పక్షులు కొరికితే క్రింద పడిపోతున్నాయి. ఉడుతలు కొరికితే రాలిపోతున్నాయి. ఈ పూవులన్నీ కాయలైతే వృక్షము మోయగలదా?" అని చెప్పారు.

**దయతో నిండిన హృదయమే నిజమైన మానవ హృదయము**

అదేవిధముగా వేమన చెప్పాడు: 'అయ్యా! రాళ్లంతా దేవుళ్లయితే రాజులంతా మింగరా' అని. వచ్చిన వారంతా భక్తులే అయితే ప్రశాంతి నిలయములో స్థలమే ఉండదు. వచ్చిన వారందరు భక్తులు కారు. సాయి మాటకు నచ్చినవారే భక్తులు. కనుక నేను తిరిగి ఆవిధముగానే వెతుకుతున్నాను. 'వెతుకుచునే ఉన్నాను నేను వెతుకుచునే ఉన్నాను'. ఎవరిని? నిజమైన మానవుని. మానవుడంటే ఎవరు? కేవలము కాళ్ళు చేతులు స్వరూపము ధరించినవాడా!

**బూరుగకాయలు చూచి మామిడియని భ్రమసినట్లు**
**వెట్టిచెరకు చూచి చెఱకని తా నమిలినట్లు**
**కలికి రాళ్ళు రూపము చూచి కలకండని భ్రమసినట్లు**
**రూపు చూచి మోసపోకు గుణమే ఇది నరుని రూపు.**

ఇట్టి గుణము చూచినప్పుడు మానవత్వము ఎక్కడా కనిపించడం లేదు. మానవత్వము ఎంత



srisathyasaivachanamrutam

పవిత్రమైనదో, ఎంత నిర్మలమైనదో, ఆదర్శవంతమైనదో చక్కగా మీరు గుర్తించాలి. దీనిని పురస్కరించుకొనియే "జంతూనాం నరజన్మ దుర్లభం" అన్నారు. మీరందరు చదువుతున్నారు. గొప్పగొప్ప ఉద్యోగము లాశిస్తున్నారు. విదేశములకు వెళ్లదలచుకున్నారు. కావలసినంత ధనము సంపాయిస్తున్నారు. 'ధనమూలమిదం జగత్త'ని భావిస్తున్నారు. పూర్వమంతా 'ధర్మమూల మిదం జగత్' అని విశ్వసించారు. ఆధునిక యుగములోపల 'ధనమూల మిదం జగత్'. కానీ సాయి ధనమునుగాని, ధర్మమును గానీ జగత్తని భావించటం లేదు. ప్రస్తుత పరిస్థితిలో 'దయమూల మిదం జగత్" దయ కావాలి, ధనము కాదు. కొంత ధనము ధర్మము చేయవచ్చు. ఇదికాదు మన జీవితము యొక్క లక్ష్యము. దయ మన లక్ష్యము. ఎందుకంటె అందరికి హృదయము ఉంటున్నాది. హృత్ + దయ = హృదయం. దయతో నిండిన హృదయమే నిజమైన మానవ హృదయము. లేకపోతే కుక్కలకు, నక్కలకు, కోతులకు ఉంటున్నది హృదయము. దయతో కూడిన హృదయమే మానవత్వము.

ప్రతి మానవుడు దయను హృదయములో నింపుకోవాలి. ఈ దయను తాను మాత్రమే అనుభవించటం కాకుండా ఇతరులకు పంచిపెట్టాలి. దయాప్రేమలు రెండూ లేని మానవత్వము మానవత్వమే కాదు.

**ఆకుపచ్చ పక్షులన్ని చిలుకలవలె పలుకునా**
**పూవులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా**
**ఏనుగంత బలిసియున్న పంది ఏనుగగునటయ్యా!**

కాదు కాదు. ఎందుకనగా 'జంతూనాం నరజన్మ దుర్లభం' దుర్లభమైన మానవత్వము ఎక్కడ మనం నిరూపించాలి? ధర్మాన్ని మనం అనుసరించాలి. ఈ ధర్మము కూడా దయతో కూడిన ధర్మముగా మనము అనుసరించాలి. భగవంతుడు ఎప్పుడు స్వార్థపరుడు కాదు. నిస్వార్థము... నిస్వార్థము. స్వార్థపరులకు నిస్వార్థముగా ఎట్లా కనిపిస్తాడు? తనయొక్క భావములను తాను ప్రతిబింబింపచేసుకోగలడు. 'యద్భావం తద్భవతి'. ఎవరెవరి భావములకు తగినట్లుగా వారు ఊహిస్తూ ఉంటారు.

కనుకనే ఉపనిషత్తులు 'ముండే ముండే మతిర్భిన్నః' అని చెప్పాయి. ఒక్కొక్క తల

srisathyasai vachanamrutam

వేరువేరుగా ఉండటం వలన తలంపులు కూడా వేరుగా ఉంటాయి. మనము తనువును దండించినంత మాత్రమున చాలదు. మనస్సును దండించాలి.

**పుట్టపై మర్దించిన పాము మరణమొందునా**
**తనువును తా దండించిన విషయ భోగములణగునా**
**ఆకలి దప్పుల వీడినంత ఆత్మజ్ఞాని తానగునా**
**తానెవరో తెలియకున్న తత్త్వజ్ఞానమెట్లు కుదురు?**

మొట్టమొదట తానెవరో తాను తెలుసుకోవాలి. అది మానవత్వములో మొట్టమొదటి లక్ష్యము. నేనెవరు? నేను దేహమా? మనస్సా? బుద్ధా? అంతఃకరణా? కాదు, కాదు. దేహము వేరు, నేను వేరు. దేహము నేను కాదు. దేహము ఒక ఉపాధి. ఇది ధరించిన వస్త్రము. ఉపాధిని తానని చెప్పటానికి వీలుకాదు. మనము చేసినదానికి తనువునే దండిస్తున్నాము గాని దేహములో ఏ దోషము లేదు. ఉన్న దోషము మనస్సులోనే ఉంటున్నది. ఒకడు ఒక చేయరాని పనిచేశాడు. తప్పని తెలుసుకొని న్యాయస్థానము దేహమునకు ఉరిశిక్ష ఇచ్చింది. తప్పు చేసింది దేహమా లేక మనసా? మనసు యొక్క ప్రోద్బలముచేత దేహము చేసింది. మనస్సు చేయించింది. చేయించింది చెడ్డదా? చేసింది చెడ్డదా? చేయించినది చెడ్డది. మనస్సును నీవు శిక్షించటము లేదు. దేహాన్ని శిక్షిస్తున్నావు. ఇది మను శాస్త్రన్యాయమా? కాదు కాదు. చేసినది జడమైన దేహము. చేయించింది మనసు. మనసే మూలకారణము. మనస్సును మనం సరైన మార్గములో ప్రవేశపెట్టాలి. ఏమి చేసినా మనసుయొక్క దోషమే కానీ, దేహముయొక్క దోషము లేదు. ప్రతి బాధ మనస్సుకు సంబంధించినదిగా ఉండాలి.

**త్యాగము చేయనివానికి ఆత్మజ్ఞానము వేలమైళ్ళ దూరములో ఉంటుంది**

షిర్డీయందు అనేక పర్యాయములు, అనేక విధములైన మార్గములలో అనేక ఉపమానములచేత జ్ఞానోపదేశము సల్పుతూ వచ్చాడు, బాబా. దైవము సర్వత్ర ఉంటున్నాడు. సర్వభూతములందు ఉంటున్నాడు. 'ఈశావాస్యమిదం సర్వం'. లక్ష్మీబాయి డాంగ్లే శ్రీమంతురాలు. అంత శ్రీమంతురాలైనప్పటికి షిరిడీలో చేరి ఆశ్రమము శుభ్రము చేయటము, ఈవిధముగా సేవావృత్తిలో ప్రవేశించింది. ఒకనాడు అవకాశము చిక్కింది. బాబా



sri sathyasai vachanamrutam

పాదములపైబడి నమస్కారము చేసింది. 'లక్ష్మీబాయి! ఆకలిగా ఉంది' అన్నాడు. 'అయ్యో! నోరార అడుగుతుంటే ఎట్లా ఊరక ఉండేది? కొంతసేపు ఉండ'మని పరుగెత్తి పోయింది ఇంటికి. అడగని ఫోటోకు నైవేద్యము పెడుతున్నాను. అడిగిన భగవంతునికి ఇవ్వలేకపోతున్నానా అని ఇంటికి వెళ్లి త్వరగా చపాతీలు చేసింది. అప్పుడు బాబా తినేవాడు. ఇంత ఎత్తు చపాతీలు తినేవాడు. ఒక్కొక్క చపాతి నాలుగు మడతలు వేసి ఒక్కతూరే తినేవాడు. ఆమె ఒకప్లేటులో చపాతీలు తీసుకువచ్చింది. 'చాలా బాగున్నాయి, మంచి రుచిగా ఉన్నాయి', అన్నాడు. నల్లకుక్క తోక ఆడించుకుంటూ వచ్చింది. దగ్గరకుపిలచి దానిని నిమురుతుంటే ఆ కుక్క చపాతీలన్నీ తినేసింది. చూస్తున్నది లక్ష్మీబాయి. 'బాబా ఇదేనా మీరు చేసేపని. ఆకలి ఆకలి అన్నారు. భగవంతుడు నోరు తెరచి అడిగాడని ఎంతో ఆప్యాయముగా, ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ చపాతీలు చేసుకువచ్చాను. నాకండ్ల ఎదురుగానే కుక్కకు పెడుతున్నారు. నేను ఏ పాపము చేశాను? నాలో ఏ దోషము ఉంటున్నది? ఈ చపాతీలు చేసే సమయంలో ఏమైనా దుర్భావములు నాలో ఆవిర్భవించినాయా? లేదు. నేను హృదయపూర్వకముగా ప్రేమతో చపాతీలు చేశాను. నన్ను ఎందుకు అవమానపర్చారు. న్యాయమా' అని ఈవిధంగా తండ్రి అంటే ఎంత అధికారమో ఆ విధంగా మాట్లాడుతూ వచ్చింది లక్ష్మీబాయి. 'లక్ష్మీబాయి కూర్చో. నేను అంతా తినేశాను. నా కడుపు నిండింది' అన్నాడు. 'బాబా! నేనెట్లా నమ్మేది, కుక్క తింటుంటే నేను చూచాను. మీరు తిన్నానంటే ఎలా నమ్మేది?' అప్పుడు చెప్పాడు: "మానవుడు ఆకలి అని అడుగుతాడు. పశుపక్షిమృగాదులు ఆకలి అని అడగలేవు. వాటికి కూడా ఆకలి ఉంది. చెప్పలేవు. అవి కూడా దైవదృష్టియే. మృగములు తిన్నప్పుడు నేను తిన్నట్లేకదా. ఈ దేహము ఒక్కటే బాబా అని నీవు భావించవద్దు. ఆ కుక్కకూడా బాబాయే. పక్షి కూడా బాబాయే. సర్వజీవరాసులు బాబాయే. అన్నింటి యందున్న బాబాను ఎందుకంత సంకుచితంగా చూస్తున్నావు? సంకుచిత భావాన్ని పెంచుకోటంచేత నిన్ను ఈవిధంగా ఏడిపించటానికి పూనుకున్నాను. సంకుచిత భావము పోవాలి. నీవు విశాల భావము పెంచుకో. ఎవరు ఏమి చేసినా దైవము యొక్క ఆజ్ఞగా భావించు. ఏ చెడ్డ, మంచి జరిగినా ఇది నామంచి కోసమనే భావించు". ఈ విధమైన సద్భావములు భక్తుల హృదయాలలో ఆవరించినప్పుడే సరైన భావముగా ఉంటుంది. ఎంతమంది వచ్చినప్పటికిని మాట్లాడలేదని పోతూ ఉంటారు. కొంతమంది మమ్మల్ని చూడలేదని

sri sathyasai vachanamrutam

పోతుంటారు. కోర్కె తీర్చలేదని పోతుంటారు. ఇంకా కొంతమంది మందిరములోనే ఉంటారు; బయట వ్యాపారము చేస్తుంటారు. అనేక రకములుగా ఉంటారు. వీరందరు భక్తులేనా? భక్తి కావాలనుకుంటే నిజమైన ఆత్మజ్ఞానముకోసం రావాలి. కానీ అది చాలా తక్కువ. ఆత్మజ్ఞానము కలిగినప్పుడే ఆత్మానందము ప్రాప్తిస్తుంది. అట్టి నిజమైన తత్త్వమును మీరు గుర్తించటానికి ప్రయత్నించాలి.

ఒక ఠాకూరు వచ్చాడు షిరిడీకి. అతని జేబులో ఐదురూపాయల నోట్లు దండిగా ఉన్నాయి. బాగా కనిపిస్తున్నాయి. దీన్ని చూచాడు బాబా. "దామా! ఊరిలోకి పోయి పటేలుదగ్గర ఐదు రూపాయలు తీసుకొని రా" అన్నాడు బాబా. ఆయన వెళ్లాడు. ఈలోగా ఠాకూరు అడుగుతున్నాడు "నాకు బ్రహ్మ జ్ఞానమును ప్రసాదించండి." కొంతసేపు ఉండు అన్నాడు. దామా వచ్చాడు, "బాబా! ఆ పటేలు ఇంటిదగ్గర లేడు," అని చెప్పాడు. "సరే oil shop దగ్గరకుపోయి తీసుకురా" అన్నాడు. అక్కడికి పోయాడు. వచ్చిన ఠాకూరు మళ్ళీ 'నాకు ఆత్మజ్ఞానాన్ని బోధించండి' అంటున్నాడు. దామా వచ్చి లేదన్నాడు. 'కిళ్ళీ కొట్టువాని దగ్గరకుపోయి అడుగు' అన్నాడు. ఈ విధముగా ఐదారు పర్యాయములు పంపించాడు దామాను. నాకు ఐదురూపాయలు చాలా అవసరంగా ఉంది తీసుకురమ్మన్నాడు. అప్పుడు ఈ ఠాకూర్‌ను చూచి చెబుతున్నాడు బాబా indirect గా, "ఠాకూర్! నీవద్ద ఐదురూపాయల నోట్లు బాగా కనిపిస్తున్నాయి. నేను ఇన్ని పర్యాయములు ఐదు రూపాయల కోసమని మనిషిని బయటకు పంపించాను. స్వామీ! నా దగ్గరున్నాయి అని ఐదురూపాయలిచ్చావా! ఎంత పిసినారివి! నీకు బ్రహ్మజ్ఞానం ఎట్లా లభిస్తుందిరా? ఇంత లోభికి ఎలా ఆత్మజ్ఞానము బోధించాలి? 'త్యాగేనైకే అమృతత్వమానశుః '. త్యాగము చేయనివానికి ఆత్మజ్ఞానము వేలమైళ్ల దూరములో ఉంటుంది. ఈనాడు నీవు ఐదు రూపాయలు ఇవ్వటానికి బాధపడుతున్నావు. కానీ ఇవన్నీ ఏదో ఒకనాడు వదలి పెట్టి పోవలసిందే. ఆనాడు ఏమి చేయగలవు? ఏమి వెంట గొనిపోగలవు? ఇదే నిజమైన ఆత్మజ్ఞానము".

**జీవితమంతా చేసిన స్మరణే అంత్యకాలములో ఆదరణ**

చాలామంది చిన్న పిల్లలు భజనలు చేస్తూ భక్తిగా ఉంటే కొంతమంది తల్లిదండ్రులు వారిని విమర్శిస్తారు: "పిచ్చివాడా! ఇంత చిన్న వయస్సులోపల భక్తి నీకెందుకు? చదువు

srisathyasaivachanamrutam

పూర్తిచేసి గొప్ప ఉద్యోగము చేసి రిటైరు అయిన తరువాత జపమాల తీసుకునికూర్చో," అని. ఇంద్రియములు ఉడిగిన తరువాత

**పదపదమంచు కింకరులు పాశములాగెడువేళ బంధువుల్**
**దబదబమంచు బైటపెట్టుడిక లాభము లేదని చెప్పువేళ**
**ఆలు బిడ్డలు లబలబ ఏడ్చువేళ**
**తరమా హరినామము నోట పల్కగాన్.**

రిటైర్ అయి కన్నులు, కాళ్లు కూలినప్పుడు వాడు ఏమి జపము చేస్తాడు? ఏమి భజన చేస్తాడు? జీవితమంతా వ్యర్థము గావించుకొని వృద్ధాప్యములో ఏమి సాధన చేయగలవు నీవు? నీవు యుద్ధములో ప్రవేశించి వీరుడై విజయము సాధించాలంటే చిన్న వయస్సునందే సైన్యములో చేరాలి. సైన్యములో చేరిన తరువాత సాధించవచ్చును. కాబట్టి బాల్యమునందే ట్రైనింగు కావాలి. జీవిత కాలములో చేసిన స్మరణే అంత్యకాలములో ఆదరణ. ఈనాటినుండియే దైవభక్తిలేక ఇంకెప్పుడు వస్తుంది? ఎప్పుడో వస్తుందనుకోటం చాలా పొరపాటు. ఇప్పటి నుంచే రావాలి. మొక్క చక్కగా ఉండినప్పుడే చెట్టు చక్కగా అవుతుంది. మొక్క వంగితే చెట్టు కూడా వంగుతుంది. ఇది చాలా పవిత్రమైన వయస్సు. దైవభావము మన హృదయంలో నింపుకోవాలి. త్యాగభావము మన హృదయములో నింపుకోవాలి. సేవకావృత్తిలో మనం ప్రవేశించాలి. ఏ కర్మ చేసినా దైవకర్మగా భావించాలి.

జపం చేయటం కాదు, తపం చేయటంకాదు, యోగం చేయటం కాదు, సేవలో మనం పాల్గొనాలి. ఎవరికి సేవ చేసినా దైవసేవగా మనం విశ్వసించాలి. అందరియందున్నది దైవమే! ఏకాత్మ సర్వభూతాంతరాత్మ. ఈ వయస్సులో పవిత్రమైన భావములే హృదయాలలో నింపుకోవాలి. లేకపోతే ఏనాడో మనకు వస్తాయనుకుంటే అది చాలా పొరపాటు. బాబా direct గాను indirect గాను ఆత్మజ్ఞానము బోధ చేస్తూ ఉండేవాడు. కానీ ఇట్టి జ్ఞానము లేనివారు, ఇట్టి సూక్ష్మము తెలియనివారు, ఇట్టి పవిత్రతను గుర్తించుకోలేనివారు భౌతికాన్ని, లౌకికాన్ని చూచి భ్రమించి పోతుంటారు. కనుక ఇవన్నీ ప్రవృత్తి లక్షణాలే.

**భారతీయులంతా ఒక్కటే అనే భావమును పెంచుకోవాలి**

sri sathyasai vachanamrutam

దివ్యమైన భావము, నవ్యమైన భావము మనలో ఉంటుండాలి. దీనికి ఐకమత్యము చాలా అవసరము. సంఘీభావము చాలా అవసరము. ధర్మజుడు చక్కని ఆదర్శము నందించాడు. ఏమిటి ఆదర్శము? మేము 105 మంది అన్నదమ్ములము. మా అన్నదమ్ములు ఐదుమంది కాదు. మాలోమాకు విభేదములు వస్తే పాండవులు ఐదుమంది, కౌరవులు నూరు మంది. మాపైన ఎవరైనా వస్తే మేము 105 మంది చేరిపోతాము. అదే విధముగా భారతీయులందరు ఒక్కటిగా ఉంటుండాలి. భారతీయ సంస్కృతి ఒక్కటే. భారతీయ ధర్మము ఒక్కటే. భారతీయ జాతి ఒక్కటే. దానిని విస్మరించి మీరు వేరు, మేము వేరని భేదములు పెంచుకోటం చేత ఛిన్నాభిన్నమై దేశపవిత్రతను పాడుచేస్తున్నారు. ఏ పార్టీ అయినాగానీ, ఏ జాతి అయినాగానీ, ఏ రాష్ట్రమైనా గానీ భారతీయులంతా ఒక్కటే! అలాంటి భావములో మనము ఏకమై ఎదుర్కొని దేశమును రక్షించుటకు పూనుకోవాలి. వ్యక్తిగత భేదములు ఎన్నో ఉండవచ్చు. వ్యక్తిగతమైనప్పుడు నీవు నీవే, తాను తానే. దేశము విషయములో ప్రవేశించినప్పుడు అందరు ఒక్కటే. అదే ధర్మజుని సూత్రము. మాలో మాకు విభేదములు సంభవించినప్పుడు మేము ఐదుమంది వారు నూరుమంది. కాని మాదేశముపైన ఎవరైనా వస్తే మేము అందరం ఏకమైపోతాము. ఈ ఐకమత్యమును మనం విచారించాలి. ఇది ధర్మజుని ప్రధానసూత్రము. అన్నింటికి ధర్మమే ప్రధానము. ధర్మము కూడా దయతో కూడిన ధర్మము ఉండాలి.

అర్థ కామ మోక్షములన్నీ ధర్మముతో ప్రారంభము కావాలి. ధనము కావాలి. ధర్మముతో కూడిన ధనము కావాలి. వాంఛలు కావాలి. ధర్మముతో కూడిన వాంఛలుండాలి. ధర్మముతో కూడినవిగా, దయతో కూడినవిగా ఉండాలి. ఈ దయ ఎక్కడుంది? హృదయమునందే ఉంటున్నది. అదే నిజమైన హృదయము.

**దేహమందు జీవుడుండు హృదయమందు దేవుడుండు**
**రెండు కూడి ఆటలాడి ఒకరినొకరు వీడుచుంద్రు**
**బొమ్మలాట లాడించే సూత్రధారి ఒకడు కలడు**
**ఒకటిలోనె రెండు నుండు రెండు చేరి ఒకటియగును**

కట్టకడపటికి రెండు ఒక్కటే అయిపోతాయి. జీవాత్మ, పరమాత్మ తత్త్వములు భిన్నము కాదు.

దేవుడే జీవుడు, జీవుడే దేవుడు. ఒకటి బింబము, రెండవది ప్రతిబింబము. ఒకటి action, రెండవది reaction. ఒకటి sound, రెండవది resound. ఈ విధమైన తత్త్వములో జీవాత్మ, పరమాత్మ రెండు ఉంటున్నాయి.

**వేదము ఏకత్వమును బోధించింది**

విద్యార్థులారా! ఈ వయస్సులోపల చదువుతోబాటు ఈ విధమైన పవిత్రమైన సంఘీభావము అభివృద్ధి గావించుకోవాలి. నీవు పుట్టినది సంఘములో. నీవు పెరిగినది సంఘములో. నీవు ఈనాడు జీవించునది సంఘములో. సంఘమునకు దూరంగా ఏవిధంగా ఉండగలవు? నీవు ఏమేమి అనుభవించావో, ఏవేవి సాధించావో అన్నీ సంఘము ద్వారానే సాధించావు. నీవు సంఘమునకు కృతజ్ఞత చూపించనక్కరలేదా? సంఘమునకు సహాయము చేయనక్కరలేదా? పుచ్చుకోటానికి సిద్ధమైతే ఇచ్చుకోటానికి కూడా సిద్ధముగా ఉండాలి. అదే నీయొక్క సరైన మానవత్వము. ఇలాంటి పవిత్రమైన సూత్రము ప్రబోధించింది భారతదేశ సంస్కృతి. పిల్లవాడు చెప్పాడు, 'సహనావవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై' అని.

**కలసిమెలసి తిరుగుదాం కలసి మెలసి పెరుగుదాం**
**కలసి మెలసి తెలుసుకున్న తెలివిని పోషించుదాం**
**కలసి మెలసి కలత లేక చెలిమితో జీవించుదాం**

వేదము మొట్టమొదట ఏకత్వాన్ని బోధించింది. కానీ ఇట్టి ఏకత్వము బోధించే వ్యక్తులు లేకపోవటంచేత వేదమంటే పనికిరాని పదార్థముగా భావిస్తున్నారు. మంత్రములుగా విశ్వసిస్తున్నారు. కాదుకాదు. సర్వశక్తులకు వేదమే మూలకారణం. సమస్తము వేదమునందే ఉంటున్నది. సమస్తము వేదమునుండే ఆవిర్భవించాయి. భారతదేశమే సర్వదేశములకు సప్లై చేసింది. ఈనాటి అస్త్ర శస్త్రములన్నీ వేదములనుండి ఆవిర్భవించినవే! అధర్వణ వేదమునుండి వచ్చినవే. ఈ విషయము భారతీయులు గుర్తించుకోలేకపోతున్నారు. అన్ని దేశములకు భారతదేశము నాయకత్వము వహించింది. అలాంటి భారతదేశ తత్త్వాన్ని ఈనాడు విద్యావంతులు చక్కగా విశ్వసించటానికి ఆదర్శాలు లేకపోతున్నాయి.

అందరు సుఖంగా ఉండాలి. అన్ని దేశములు సుఖంగా ఉండాలి.

sri sathyasai vachanamrutam

దైవప్రేమను మనం పెంచుకోవాలి. దీనికి మించినది మరొకటి లేదు. ఒక్క ప్రేమ ఉండిన ఇంక సర్వస్వము మనం సాధించవచ్చును. కారణం ఏమిటి? అందరి యందు ఉన్నది ప్రేమ ఒక్కటే. అందరియందు ప్రతిబింబిస్తున్నది ప్రేమ ఒక్కటే. ఈ విధమైన నిజతత్వమును మనం గుర్తించినప్పుడు మానవత్వాన్ని మనం గుర్తించినవారమవుతాము. లేకపోతే మానవత్వాన్ని గుర్తించినవారము కూడా కాదు. మానవుడంటే నమ్మకము కలవాడని చెప్పాను. ఈనాడు ఏ మానవునిలో చూచినా నమ్మకము లేదు. నమ్మకము లేనప్పుడు ఏమి చేసి ఏమి ప్రయోజనం? నమ్మకమును పెంచుకోవాలి.

**నమ్మకమను రెండు నయనమ్ములే లేని**
**అంధులైరి మనుజు లవని యందు.**

ఈ నమ్మకమనే కన్నులు లేకపోతే మనం గుడ్డివారమే. పోనీ నిన్ను నీవైనా నమ్ముకుంటున్నావా? నిన్ను నీవు నమ్మనివాడవు దేవుని నమ్మనివాడవే. అందువల్లనే faith in yourself, and faith in God - this is the secret of greatness. నీపై నీకు నమ్మకముంటే చాలు. నిన్ను నీవే నమ్మనివాడవి ఇంకెవరిని నమ్మగలవు?

**విద్య వివేకమును, విచక్షణను పెంపొందించాలి**

ఈనాటి విద్యాభ్యాసం ఈ విధమైన అధోగతికి దిగజారిపోయింది. ఇవన్నీ విద్యలే కావు. కారణం ఏమిటి? విజ్ఞానం బోధించేది విద్య అనుకుంటున్నాం. కానీ విజ్ఞానము ప్రపంచమును ఛిన్నా భిన్నము చేస్తున్నది. వివేకమును, విచక్షణను పెంపొందించాలి విద్య. విచక్షణా విజ్ఞానము లేని విద్య ఏమి ప్రయోజనము.

**ఎం ఏలు బి ఏ లు ఏర్పడ చదివియు**
**పేరుగాంచిన పెద్దవారలైన**
**సంపదలుండియు సద్దానపరులౌచు**
**పుడమికీర్తిని గన్న పుణ్యులైన**
**ఆయురారోగ్యము లనవరతంబుండి**

sri sathyasai vachanamrutam

**పరిపూర్ణ బలులగు వారలైన**
**జపములు తపములు సతతంబు చేయుచు**
**వేదంబులను నేర్చు విప్రులైన**
**సాటిరారు భక్తులకు ఏనాటికైన**
**దైవభక్తి లేనిదె రాదు ముక్తి**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు**

**సాధుసద్గుణ సభ్యులౌ విద్యార్థులారా!**

ఇంతకంటె ఏమి కావాలి? దైవ విశ్వాసము లేక ఏమి చేసినా ప్రయోజనము లేదు. మంచి కూరగాయలు తెచ్చాము. మంచి వంటవాడు చిక్కాడు. చక్కని పప్పు, ఉప్పు, చింతపండు, మంచిపాత్ర, దీనితో సాంబారు వండాము. కానీ సాంబారు చెడిపోయింది. కిలుము పట్టింది. కారణం ఏమిటి? చింతపండు దోషమా; కూరగాయల దోషమా? పప్పులో దోషమా? ఇవేవీ కాదు. పాత్రలో కళాయి లేక పోవటంవలన ఇదంతా పాడైపోయింది. మనము జపములు, తపములు, ధ్యానములు, యోగములు అన్నీ చేస్తున్నాము. హృదయమనే పాత్రలో కళాయి లేకపోతే ఇదంతా పాడైపోతుంది. ప్రేమ అనే కళాయి ఈ పాత్రలో ఉంటుండాలి. ప్రేమలేక ఎన్ని విధముల పాకము చేసినా పాడైపోతుంది. చెట్టంతా కళకళలాడు తున్నది. ఫలపుష్పములతో ఈనాడు శోభగా కనిపిస్తున్నది. రేపటి దినము వాడిపోయింది. కారణం ఏమిటి? దాని వేరుకు పురుగు పట్టింది. అది కనిపించటం లేదు. మన జీవితము ఎన్ని సుఖశాంతులతో వర్థిల్లుతున్నప్పటికి దైవానుగ్రహము లేకపోతే, దుర్గుణమనే వేరుపురుగు పడితే అది వాడిపోతుంది. మన జీవితమునకు శత్రువు లెవరు? కామక్రోధ లోభములే శత్రువులు. కామము కర్మలను చెడగొడుతున్నాది. క్రోధము భక్తిని చెడగొడుతుంది. లోభము జ్ఞానమును చెడగొడుతుంది. మూడు చెడిన తరువాత ప్రయోజనం ఏముంది? కనుక మనము కర్మమార్గములోనైనా ప్రవేశించాలి లేక ఉపాసనా మార్గములోనైనా ప్రవేశించాలి లేక జ్ఞాన మార్గములోనైనా ప్రవేశించాలి. మూడు లేక ఏమీ ప్రయోజనము లేదు. ఈనాడు ఆకారమానవుడే కాని ఆచారమానవుడు ఎక్కడా కనపడటం లేదు.

sri sathyasai vachanamrutam

ప్రేమ స్వరూపులైన విద్యార్థులారా! ప్రేమను పెంచుకోండి. ప్రేమ మీద మీరు concentrate చేయండి. అనవసర విషయాలపై concentrate చేయకండి. చదువులు బాగా చదవండి. మంచి మార్కులు తెచ్చుకోండి. తల్లితండ్రులను సంతోషపెట్టండి. వారికి తగిన శాంతిని ఇవ్వండి. ఎందుకోసం? 'మాతృదేవో భవ, పితృదేవోభవ'. మీ బ్లడ్, మీ ఫుడ్, మీ దుడ్డు parents gift. మొట్టమొదట తల్లితండ్రులకు gratitude ఇవ్వండి. వారిని సంతృప్తి పరచండి. దైవము తప్పక సంతృప్తి పడతాడు. తల్లి దైవమే! తండ్రి దైవమే! సర్వులు దైవమే! తల్లిదండ్రులనుంచి ప్రారంభించు. తరువాత విశ్వమంతా వ్యాప్తి చేసుకో. అదే నిజమైన ఆనందము. దైవ ప్రార్థన చేసుకుంటూ కాలమును పవిత్రము చేసుకుంటూ జీవితము సార్థకము చేసుకొని ఆదర్శవంతమైన విద్యార్థిగా రూపొందాలి.

1996 జూన్ 23వ తేది సాయికుల్వంత్‌హాల్‌లో భగవాన్ దివ్యోపన్యాసం

sri sathyasai vachanamrutam